క్లుప్తంగా

నేడు భగవాన్ రమణ మహర్షి జయంత్యుత్సవాలు



రాజంపేట : నియోజక వర్గ కేంద్రమైన రాజంపేటలో శనివారం భగవాన్ రమణ మహర్షి 144 జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు భగవాన్ రమణ మహర్షి భక్తబృందం శుక్రవారం ఇక్కడి విలేకర్లకు తెలియజేసింది. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్బీ బంగ్లా సమీపంలోని గ్రంథాలయం వద్ద భగవాన్ రమణ మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

నేటి నుంచి 'వీక్షిత్ భారత్'

నందలూరు(రాజంపేట) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం నుంచి ఆరు రోజులపాటు వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 30 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 4వ తేదీ వరకు ఆరురోజులపాటు మండలంలోని అన్ని పంచాయతీలలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున రాజంపేట బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజు మస్తానయ్య, వీబీఎస్వై కార్యక్రమం కన్వీనర్ ఆదినారాయణతో పాటు అధికారులు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

సంబేపల్లె : ఇటీవల సంబేపల్లె మండలంలోని జాతీయ రహదారిపై మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి శుక్రవారం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫాతిమా ఒకరికి జైలు, ఐదు మందికి జరిమాన విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ షరీఫ్ తెలిపారు. వీరిలో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించగా మిగతా ఐదు మందికి ఒక్కొక్కరికి రూ. 10,500లు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీనివాసులు రెడ్డి

చిట్వేలి : మండల పరిధిలోని చింతలచెలిక అరుంధతివాడలో రూ.4 లక్షల వ్యయంతో వేయనున్న సీసీ రోడ్డుకు శుక్రవారం మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పల్లె ప్రాంతాలు, ముఖ్యంగా దళితవాడల్లో సిమెంట్ రోడ్లు వేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామ నాయకుడు మాదినేని కనకరాజు మాట్లాడుతూ త్వరలో పనులు ముగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లింగం లక్ష్మీకర్, నారాయణ, శ్రీను, శివ, కోదండరామయ్య, ప్రసాద్, నాగరాజు, వలంటీర్లు నారాయణ, నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందీలో వందశాతం ఉత్తీర్ణత కావాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

పుల్లంపేట : మార్చిలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హిందీలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ చక్రధర్ రాజు తెలియజేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హిందీ ఉపాధ్యాయులకు ఎంఈఓ పలు సూచనలు చేశారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉత్తీర్ణత సాధించడానికి సులభమైన టిప్స్‌ను సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు తెలియపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సబ్జెక్టు ఆర్పీలు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కారు, స్కూటర్ ఢీ

గాలివీడు : మండల పరిధిలోని కొనంపేట – గాలివీడు ప్రధాన రహదారిలోని ప్యారంపల్లె గ్రామం వడ్డెపల్లె వద్ద కారు స్కూటర్ ఢీ కొనడంతో స్కూటరిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గాలివీడు నుంచి పసలవాండ్లపల్లెకు రామాంజులు తన స్కూటర్‌లో వెళ్తుండగా లక్కిరెడ్డిపల్లె నుంచి గాలివీడుకు వస్తున్న కారు మార్గమధ్యలోని ప్యారంపల్లె గ్రామం వడ్డెపల్లె వద్ద ఢీ కొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టుకు కాలు విరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్కూటరిస్టు రామాంజులును 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- ప్రతిభను వెలుగులోకి తేవడానికే ఆడుదాం ఆంధ్ర
- ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా



రాజంపేట టౌన్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మేడా, ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను శుక్రవారం మేడా, ఆకేపాటి, పోలా వీక్షించారు. తొలుత వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడా చరిత్రలోనే ఆడుదాం ఆంధ్ర పెద్ద మైలురాయి అని తెలిపారు. క్రీడల్లో సత్తా చాటేందుకు ఇది చక్కటి వేదికని, దీనిని ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ పోటీల వల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. రాజంపేట నియోజకవర్గం నుంచి అన్ని క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం ఉండాలన్న లక్ష్యాన్ని క్రీడాకారులు నిర్దేశించుకొని రాణించాలని ఆకాంక్షించారు. దేశంలోనే ఆడుదాం ఆంధ్ర ఓ మెగా టోర్నీ అని వారు అభివర్ణించారు. కాగా నాల్గవ రోజు కూడా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీల్లో పాల్గొన్నారు. అలాగే పోటీలను అనేక మంది వీక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, న్యామత్, మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, పోటీల ఆర్గనైజర్ ఎస్.షామీర్‌బాషా, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ వడ్డే రమణ, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, సత్యాల రామకృష్ణ, వడ్డే శ్రీను, మురళీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా పోటీలు

ఓబులవారిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఉదయం మండల కేంద్రానికి చెందిన రెండు మహిళా టీమ్‌ల మధ్య కబడ్డీ పోటీలు నిర్వహించగా మధ్యాహ్నం ఓబులవారిపల్లె, పుట్టికవారిపల్లె జట్ల మధ్య కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలలో ఓబులవారిపల్లె జట్టు గెలుపొందింది. పోటీలు చూసేందుకు పెద్ద ఎత్తున గ్రామస్తులు వచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసాద్, పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు జంగా శ్రీనివాసులు, వలంటీర్లు మల్లికార్జున, షఫీ తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: కబడ్డీ పోటీలలో తలపడుతున్న ఆటగాళ్లు

బస్సు యాత్ర విజయవంతంపై ఎమ్మెల్యే హర్షం



శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : రాయచోటిలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయడంపై రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తనపై అత్యంత ప్రేమ, అభిమానం ఉందనేది సామాజిక యాత్ర ద్వారా మరోసారి నిరూపించిన నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమానికి బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ప్రజలు తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. అలాగే యాత్ర విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలకు, ప్రజలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

వైవీయూ : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఈఎంఓ డి.రమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం–1994'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందని తెలిపారు.

సమన్వయంతో ప్రజలకు సంక్షేమ పథకాలు



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సానిపాయి గ్రామం, ఓదివీడు గ్రామాలలో ఆయా గ్రామ సచివాలయాలలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఓదివీడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాల సంక్షేమ పథకాలను సమన్వయంతో ప్రజలకు నేరుగా అందిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పివి శివరాం, ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ప్రభుత్వం దృష్టికి పురపాలిక కార్మికుల సమస్యలు



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : పురపాలిక కార్మికుల సమస్యలను తన వంతు బాధ్యతగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద జరుగుతున్న పురపాలిక కార్మికులను ఎమ్మెల్యే కలుసుకున్నారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమకు వేతనాలు పెంచాలని, ప్రస్తుతం ధరలు పెరిగాయని, అందుకు తగ్గట్టుగా జీతాలు పెంచితే సంతోషమన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పురపాలక సంఘం అభివృద్ధి సమష్టి కృషి ఉంటే జరుగుతుందని ఇందుకు కార్మికులు సహకరించాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనరు వడ్డే రమణ, కౌన్సిలర్లు పసుపులేటి సుధాకర్, కూండ్ల రమణారెడ్డి, నవీన్ శెట్టి, ప్రతాప్, బీసీ వడ్డే శ్రీను, కో–ఆప్షన్ సభ్యుడు రాముయాదవ్, నాయకులు రాజేశ్, రఘురామిరెడ్డి, మీసాల వెంకటసుబ్బయ్య, మురళీ ఆచారి, ఎస్సీనాయకుడు సత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా కార్మికుల పక్షాన సీఐటీయూ నేత చిట్వేలి రవికుమార్ ఎమ్మెల్యేకి కార్మికుల సమస్యలను వివరించారు.

రేపటి నుంచి కేవలానంద ఆరాధనోత్సవాలు



శ్రీ లక్ష్మణార్య స్వామిజీ

రామాపురం : మండల కేంద్రంలోని శ్రీ కేవలానంద లక్ష్మణార్య స్వామిజీ 64వ ఆరాధన ఉత్సవాలు రేపటి నుంచి జరగనున్నాయి. శ్రీ కేవలానంద లక్ష్మణార్యస్వామిజీ ఆరాధనోత్సవాలు ప్రతి ఏడాది డిసెంబర్ 31న నిర్వహించడం ఆనవాయితీ. మహిమాన్వితుడుగా స్వామిజీని రాయలసీమ వ్యాప్తంగా భక్తులు కొలుస్తారు. ఈ ఆరాధనోత్సవాలల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. గురుపూజ, భజనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాధు జెండా ప్రదర్శన స్వామిజీ వారి స్వగ్రామం నుంచి ఊరేగింపు కార్యక్రమాలు తిరుపతి – తిరుమల దేవస్థానం ఏర్పాటు చేసే కార్యక్రమాలు అన్నవితరణ కార్యక్రమం రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది డిసెంబర్ 31న మొదలై జనవరి 2న తెల్లవారుజామున వరకు నిర్వహిస్తారు. వైఎస్సార్ జిల్లాలోని శ్రీ అవధూత కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు తరువాత శ్రీ లక్ష్మణార్య స్వామిజీ ఆరాధనోత్సవాలు పెద్ద ఎత్తున జరుపుతుంటారు.

భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పొలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, యోగి స్వాములు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. అలాగే మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. రాహుకాల పూజ విశిష్టతను అర్చకులు వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కురుబల అభివృద్ధికి విశేష కృషి

- కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్రంలోని కురబల సంక్షేమానికి, కుల, రాజకీయ అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు జబ్బలశ్రీనివాసులు తెలిపారు. స్థానిక కురబ సంఘం రాష్ట్రకార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్త కనకదాసు 536వ జయంతి వేడుకలు, ఏపీ కురుబసంఘం 8వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యులు, బీసీ జాతీయసంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కురబలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. అలాగే గతంలో కురుబ కులస్తుల్లో కొందరి అభ్యర్థన మేరకు రాష్ట్ర సంఘం పేరులో కురువ పదాన్ని తొలగించామని, అయితే కురువలు కురుమలలో అంతరభాగంగా పిలవడం జరుగుతోందని అభ్యర్థించడంతో తిరిగి కురువ పదాన్ని జతచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కప్పలరాజన్న, గుడి రామాంజులు, రాజ్‌కుమార్, రంగా, శ్రీనివాసులు, కొప్పల హరినాథ్, వెంకటరమణ, వల్లిగట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గంగా భవానిని దర్శించుకుంటున్న భక్తులు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 పంచాయతీ పరిధి బంగారుపేట గ్రామ శివారులో వెలసిన శ్రీ గంగా భవాని అమ్మవారికి శుక్రవారం ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్ద సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి గణపతి పూజ, పుణ్యాహవాచనము, స్వస్తి వాచనము, మాతృక పూజ, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

జనవరి ఫస్ట్‌కు హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : నూతన ఆంగ్ల సంవత్సరాదికి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె–హార్సిలీహిల్స్‌కు 10 బస్సులు, అంగళ్లు–హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు, కాండ్లమడుగు క్రాసు–హార్సిలీహిల్స్‌కు 8 బస్సులు, బి.కొత్తకోట– హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె– మల్లయ్యకొండకు 3, మదనపల్లె–బెంగుళూరుకు 5 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

తలకోనకు ..

మదనపల్లె సిటీ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన తలకోనకు నూతన ఆంగ్ల సంవత్సరానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. సోమవారం ఉదయం 8, 9, 10 గంటలకు స్పెషల్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సంస్థను ఆదరించాలని కోరారు.

288 మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బూడిదగడ్డ గ్రామానికి చెందిన వేంపల్లి గంగమ్మ (56) అనే మహిళ కాలిబాటన సంచితో నడుచుకుంటూ వస్తుండగా పోలీసులు తనిఖీ నిర్వహించారు. అందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రూ.11,500ల విలువ చేసే 288 మద్యం ప్యాకెట్లు పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

బోటింగ్ బోణీ అదిరింది

రూ.9 లక్షలకు టెండర్ దాఖలు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యావరణ సముదాయంలోని మానస సరోవరంలో బోటింగ్ నిర్వహణ టెండర్‌కు అధికారులు ఊహించని ధర దక్కింది. వచ్చే జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు బోటింగ్ నిర్వహణ బాధ్యతలను ప్రయివేటుకు అప్పగించేందుకు అటవీశాఖ డీఎఫ్ఓ పళణి వివేక్ నిర్ణయించారు. దీనిపై గురువారం రాజంపేట కార్యాలయంలో రెండు టెండర్లు దాఖలయ్యాయి. ప్రభుత్వం టెండర్ ధర రూ.6 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన వంశీధర్ రూ.6.60 లక్షలకు, కాండ్లమడుగుకు చెందిన రమేష్ రూ.9 లక్షలకు టెండర్ దాఖలు చేశారు. అధికధరకు టెండర్ దాఖలు చేసిన రమేష్‌కు బోటింగ్ లీజు బాధ్యతను అప్పగిస్తూ వివేక్ ఉత్తర్వులు జారీ చేసారని మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం చెప్పారు.

పత్రికల పఠనం.. విజ్ఞానానికి దోహదం

కడప ఎడ్యుకేషన్ : పత్రికల పఠనం విజ్ఞానానికి దోహద పడుతుందని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం సంయుక్తంగా ముద్రించిన తిరుగుబాటు మాసపత్రికను శుక్రవారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓలు రాజగోపాల్ రెడ్డి, క్రిష్టప్పలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : సీఎం సహాయనిధి పేద ప్రజలకు అండగా నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆకేపాటి పంపిణీ చేశారు. ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల నల్లబొల్లయ్య గారి వెంకటలక్ష్మికి రూ. 37 వేలు, రాజంపేట మండలం పోలి గ్రామానికి చెందిన మాదరపు రత్నమ్మకు రూ. 65 వేలు చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం అక్కడికి వచ్చిన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీము సుబ్బారెడ్డి, ఎ.చెంచురెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ శివనారాయణ, ఎం.శ్రీనివాసులు గౌడ్, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.అమరనాథ్, శంకర్ శెట్టి, జి.కళ్యాణ్ రెడ్డి, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య అంతరాలు తొలగిద్దాం

రాయచోటి టౌన్ : కులాల మధ్య అంతరాలను తొలగించి హిందూ ఏకీకరణ కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ కార్యదర్శి బండి బాలాజీ కోరారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన హిందూ చైతన్య వేదిక నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుడు ఆశించినట్లుగా భారతీయ సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, దురాచారాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అధునిక సైన్స్‌కు, వేదాంతానికి మధ్య సమన్వయం పరిచేందుకు హిందూ చైతన్య వేదిక పని చేస్తుందని తెలిపారు. దీని కోసం రాయచోటిలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నూతన కమిటీ నగర సంయోజక్‌గా నంద్యాల లక్ష్మీకర్, సహ సంయోజక్‌గా గొల్ల శ్రీరాములు, దేవేంద్ర, రవిశంకర్, సభ్యులుగా నాగార్జున, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, ఓబుల్‌రెడ్డి, జనార్దన, కుమార్ స్వామి, సాగర్, రూపేష్, నివాస్‌లను ఎంపిక చేశారు.

కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహకుడు వేణు, హిందూ చైతన్య వేదిక జిల్లా సహ సంయోజక్ సుజయ్‌కుమార్, వేల్పుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం

- ఫిష్ ఆంధ్రా – ఫిట్ ఆంధ్రా నినాదంతో ఫిష్ హబ్‌లు
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, స్కిల్‌డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ హార్టికల్చర్ కళాశాల సమీపంలో ప్రధాన రహదారి పక్కనే శుక్రవారం ఫిష్ ఆంధ్రా రెస్టారెంట్‌ను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఆంధ్రా ఫిష్ హబ్‌ల ద్వారా విక్రయాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా – ఫిట్ ఆంధ్రా నినాదంతో ఫిష్ హబ్‌ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ ఆంధ్రా హబ్‌లను ఏర్పాటు చేయాలన్న సంకల్పం మేరకే ఫిష్ ఆంధ్రాకు శ్రీకారం చుట్టారని తెలియజేశారు. చేపల్లో అత్యంత పోషకాలు ఉన్నాయని, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ రెస్టారెంట్‌లు, హబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వీఎస్‌కే చైతన్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఎంపీటీసీ బండారు మల్లికార్జున, కిషోర్, జయపాల్ రెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో నలంద పాఠశాల విద్యార్థులు

సిద్దవటం : రాష్ట్రస్థాయి సైన్ ఫెయిర్‌లో సిద్దవటంకు చెందిన నలంద హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణ స్వామి, కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ కడప నగరం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28, 29 తేదీలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో భాగంగా 28వ తేదీన సాయంత్రం సిద్దవటంకు చెందిన శ్రీ నలంద పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయని వారన్నారు.

హార్సిలీహిల్స్‌పైకి బైక్, ఆటోలు నిషేధం

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతారణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మదనపల్లె డీఎస్పీ కే.కేశప్ప వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండపై రెండు రోజులు ఆంక్షలను అమలు చేస్తున్నామని తెలిపారు. వేడుకలను పురస్కరించుకుని సాధారణ సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వశాఖల సిబ్బంది సహకరించాలన్నారు. డిసెంబర్ 31న కొండకింద తాత్కాలిక చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిర్వహకులు అతిథి గృహాల్లో మద్యాన్ని అనుమతించకూడదని, మద్యం సేవించాక ఏదైనా సంఘటనలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. 31వ తేది రాత్రి, జనవరి ఒకటిన ఎవరైనా కొండపై బహిరంగంగా మద్యం సేవించినా, మద్యం సేవించి బైక్ రైడ్ చేస్తూ సందర్శకులకు ఇబ్బందులు కలిగించినా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై చలిమంటలు వేయకూడదని అతిథి గృహాల యజమానులను కోరారు. అతిథిగృహాల్లో విందులు, వినోదాల కోసం డీజే శబ్దాలతో ఇబ్బంది కలిగిస్తే సందర్శకులు, వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కొండపైకి రెండు రోజులు మద్యం తీసుకెళ్లడం కూడా నిషేధమని చెప్పారు. ప్రమాదాల నివారణకు బైక్, ఆటోలను కొండపైకి వెళ్లడానికి నిషేధమని చెప్పారు. వీటిని చెక్‌పోస్టు వద్దే నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని తెలియజేశారు. సంబరాలు జరుపుకునే సందర్శకుల భద్రత కోసం 50 మంది పోలీసులు, నలుగురు ఎస్ఐలు, ఒక సీఐ బందోబస్తు విధుల్లో ఉంటారని చెప్పారు.